క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం

గంట్యాడ: మండలంలోని కొండతామరపల్లి జంక్షన్‌లో ఉన్న కల్యాణ మంటపంలో వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, పార్టీ ముఖ్య నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జాగరపు అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి గజపతినగరం మాజీ శాసనసభ్యుడు బొత్స అప్పలనరసయ్య హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుడతామని, ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు.

దుప్పట్ల పంపిణీ



గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

బొండపల్లి: మండలంలోని వెదురువాడ పంచాయతీ పరిధి గిరిజన గ్రామమైన మూలపాడులో గిరిజనులకు తహసీల్దార్ డోల రాజేశ్వరరావు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌ను పరిశీలించి, విద్యార్థుల విద్యా ప్రమాణాలపై ఆరా తీశారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. చలికాలాన్ని దృష్టిలో పెట్టుకుని దుప్పట్లు పంపిణీ చేసినట్లు తహసీల్దార్ ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో డీటీ రాజేశ్వరరావు, ఆర్ఐ హరికృష్ణ, వీఆర్‌ఓ ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ



సత్యసాయి సేవాసమితి సభ్యుల నుంచి బహుమతి అందుకుంటున్న విజేత

శృంగవరపుకోట: భగవాన్ సత్యసాయిబాబా 100వ జన్మదినోత్సవం సందర్భంగా ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో స్థానిక ఉన్నత పాఠశాల/జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ మేరకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ఎస్.కోట సత్యసాయి సేవాసమితి జోనల్ కో ఆర్డినేటర్ త్రిమూర్తులు, డాక్టర్ త్రినాథరావు, సేవాదళ్ ఇన్‌చార్జ్ శ్రీరామ్మూర్తి, బీవీఎస్ దాస్, గ్రంది గాంధీ, సూర్యనారాయణ, తదితరులు గురువారం బహుమతులు అందజేశారు. ఈ మేరకు విద్యార్థులను పలువురు అభినందించారు.

సైన్స్ సెమినార్‌కు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ విజయ్‌కుమార్

చీపురుపల్లి: జిల్లా స్థాయిలో జరగనున్న సైన్స్ సెమినార్‌కు మండలం నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు విద్యార్థులను స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ-2 విజయ్‌కుమార్ గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురువారం జరిగిన మండల స్థాయి సెమినార్ పోటీల్లో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన జి.ఆదిత్యవర్ధన్, పి.తనిష్క్ ప్రతిభకనబరిచి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. ఈ నెల 27న జరగనున్న పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకురాలు ఎస్. వెంకటలక్ష్మి, ఉపాధ్యాయుడు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న హౌసింగ్ పీడీ మురళి

దత్తిరాజేరు: మండలంలోని దత్తి గ్రామంలో పి. అప్పలరాజు ఇంటి నిర్మాణానికి సంబంధించి గృహ నిర్మాణశాఖ పీడీ మురళి గురువారం స్థల పరిశీలన చేశారు. ఈ నెల ఒకటో తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దత్తి గ్రామానికి వచ్చి కిడ్నీ మార్పిడి చేసుకున్న అప్పలరాజుకు పింఛన్ అందజేశారు. ఈ సమయంలో ఆయనకు ఇల్లు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చిన నేపథ్యంలో పీడీ స్థల పరిశీలన చేపట్టారు. ఈ సమయంలో గ్రామస్తులు ఇప్పటికే నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఇళ్లకు సంబంధించి బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారని పీడీని కోరగా.. త్వరలోనే చెల్లింపులు జరుగుతాయన్నారు. ఆయన వెంట తహసీల్దార్, తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన పల్లె వైద్యం..

- వైద్యుల సమ్మెతో అరకొరగా అందుతున్న వైద్యసేవలు
- 104 వైద్యసేవలు అందక గ్రామీణుల ఇక్కట్లు



నిర్మానుష్యంగా ఉన్న అలమండ పీహెచ్‌సీ

జామి: రోగులకు ప్రభుత్వ వైద్యసేవలు అరకొరగా అందుతున్నాయి. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వైద్యులు పది రోజులుగా సమ్మె చేస్తున్నారు. దీంతో పీహెచ్‌సీల్లో వైద్యసేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి. దీంతో చాలా మంది ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోంది. మండలంలో జామి, అలమండ పీహెచ్‌సీలున్నాయి. మండలంలో సుమారు 50 వేల జనాభా ఉంది. రెండు పీహెచ్‌సీలకు రోజుకు సుమారు నాలుగు వందల మంది రోగులు (ఓపీ) వస్తుంటారు. అయితే వైద్యుల సమ్మెబాట పట్టడంతో రోగుల సంఖ్య తగ్గింది. తప్పనిసరి పరిస్థితుల్లో కొంతమంది రోగులు ఆర్ఎంపీలను.. మరికొంతమంది ఎస్.కోట, విజయనగరం ప్రాంతాల్లోని ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇదిలా ఉంటే వైద్యులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో విజయనగరం, తదితర ఆస్పత్రుల నుంచి వైద్యులను పీహెచ్‌సీలకు తాత్కాలికంగా కేటాయించారు. తాత్కాలికంగా నియమితులైన వైద్యులు ప్రస్తుతం రోగులను పరీక్షిస్తున్నారు. అయితే ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు వరకు మాత్రమే రోగులను పరీక్షించి వెళ్లిపోతుండడంతో.. మిగిలిన సమయాల్లో రోగులకు సేవలు అందడం లేదు.

పల్లెల్లో అంతంతమాత్రమే..

మండల పరిధిలో ప్రతిరోజూ ఎంపిక చేసిన గ్రామంలో 104 సేవలు అందించాలి. పీహెచ్‌సీల్లో ఇద్దరు వైద్యులు ఉన్నప్పుడు ఒక డాక్టర్ 104 ద్వారా గ్రామానికి వెళ్లి సేవలు అందించేవారు. మరొక వైద్యుడు పీహెచ్‌సీల్లో సేవలు అందించేవారు. ప్రస్తుతం వైద్యాధికారులు సమ్మెబాటతో తాత్కాలికంగా ఉన్న వైద్యులు పీహెచ్‌సీల్లో ఉంటున్నారు. దీంతో 104 వాహనాల్లో వైద్యుడు వెళ్లడం లేదు. ఉన్న సిబ్బంది మాత్రం గ్రామాలకు వెళ్లి అరకొరగా సేవలందించి వస్తున్నారు.



రోగులను పరీక్షిస్తున్న ఇన్‌చార్జ్ వైద్యురాలు



జామి పీహెచ్‌సీలో దర్శనమిస్తున్న 104 వాహనం

రోగులకు తప్పని ఇబ్బందులు..



వైద్యులు సమ్మెబాట పటట్టడంతో పీహెచ్‌సీల్లో అరకొరగా సేవలు అందుతున్నాయి. ఒకే డాక్టర్ ఉండడంతో అత్యవసర సమయాల్లో రోగులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల్లో 104 వాహనం ద్వారా కూడా సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి. వైద్యులు సమ్మె విరమించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– సీహెచ్.రాజు, ఏఆర్ పేట, జామి మండలం

వైద్యసేవలు ఉచితంగా అందాలి..



దమరసింగిలో ప్రైవేట్ కళాశాలకు వ్యతిరేకంగా సంతకం చేస్తున్న దివ్యాంగుడు రామునాయుడు



కోటి సంతకాలు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

గుర్ల: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణ రాజు, మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు అన్నారు. వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడంపై మండలంలోని సాలిపిసోమేరాజుపేట, మన్యపురిపేట, దమరసింగి గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బెల్లాన బంగారునాయుడు, బోళ్ల సుబ్రహ్మణ్యం, కెంగువ మధుసూదనరావు, తోట తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధంగా ఉండాలి..

దత్తిరాజేరు: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా పోటీకి సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పిలుపునిచ్చారు. ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ దూరంగా ఉంటుందని ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందని.. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని పార్టీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి తనకు సూచించారని చెప్పారు. మండల కేంద్రంలోని మాజీ సర్పంచ్ ఫణీంద్రుడు ఇంటి వద్ద మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. పార్టీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య మాట్లాడుతూ.. పార్టీ బలోపేతం కోసం గ్రామ అనుబంధ సంఘాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం నాయకుడు మజ్జి అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొని సంతకాలు సేకరించారు.

ప్రజాదరణ కోల్పోయింది..

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 15 నెలల్లోనే ప్రజాదరణ కోల్పోయిందని ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ చురుగ్గా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మజ్జి అప్పలనాయుడు, ఉమా నరసింగరావు, ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, సీనియర్ కంది తిరుపతినాయుడు, సుమల గోవింద్, దత్తి చిరంజీవి, సుమల శ్రీను పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ నిర్వహణపై సమీక్ష

వేపాడ: మండల స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహణపై గురువారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో వ్యాయామ ఉపాధ్యాయులతో ఎంఈఓ బాలభాస్కరరావు సమీక్షించారు. అండర్ 14, 17 విభాగాల్లో నిర్వహించాల్సిన క్రీడలపై చర్చించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయిస్తే చర్యలు

బొండపల్లి: ప్రభుత్వ అనుమతుల్లేకుండా బాణసంచా విక్రయించినా, తయారుచేసినా చర్యలు తప్పవని ఎస్సై యు.మహేష్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. దీపావళి నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా మందుగుండు విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసులు, సంబంధిత అధికారుల అనుమతి తీసుకున్నవారు మాత్రమే విక్రయాలు చేపట్టాలన్నారు.

మెగా ఫోన్ వితరణ



మెగాఫోన్ అందిస్తున్న దాతలు సూర్యనారాయణ, చంద్రకళ

వేపాడ: మండలంలోని కరకవలస పంచాయతీ శివారులో ఉన్న మారిక ప్రాథమిక పాఠశాలకు విశ్రాంత ఉపాధ్యాయులు మెగాఫోన్ గురువారం వితరణగా అందజేశారని పాఠశాల ఉపాధ్యాయుడు తాడి రాంబాబు తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయులు జీవీ సూర్యనారాయణ, చంద్రకళ మెగా ఫోన్ అందించడంపై ఉపాధ్యాయులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

విచారణ



విచారణకు హాజరైన జిందాల్ నిర్వాసిత రైతులు

శృంగవరపుకోట: జిందాల్ కంపెనీ కోసం భూములు ఇచ్చిన నిర్వాసితులు తమకు న్యాయం చేయాలంటూ గ్రీవెన్స్ సెల్‌లో ఇచ్చిన ఫిర్యాదులపై రెవెన్యూ అధికారులు గురువారం బొడ్డవరలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఈ నెల 8, 14 తేదీల్లో సంయుక్త సర్వేకు హాజరుకావాలని జిందాల్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేసినా వారు హాజరుకాలేదన్నారు. దీంతో రైతులతో విచారణ చేసేందుకు తాము విచారణకు వచ్చినట్లు చెప్పారు. ఈ సమయంలో నిర్వాసిత రైతులు కలుగజేసుకుని జిందాల్ కంపెనీ ప్రతినిధులు రాలేదని సర్వే ఆపడం సరికాదని.. వెంటనే సర్వే చేసి భూములు తమకు అప్పగించాలని కోరారు.

ముగ్గురి అరెస్ట్

విజయనగరం క్రైమ్: నగరంలోని ఓ ఇంట్లో బంగారం చోరీకి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఈ నెల ఏడో తేదీన నగరంలో జరిగిన పైడితల్లి సిరిమానోత్సవానికి అద్దెపల్లి వారి వీధికి చెందిన రాధ వెళ్లిపోగా ఆమె ఇంట్లోకి చొరబడిన దుండగులు 19 గ్రాముల బంగారం, 1339 గ్రాముల వెండి, టీవీ, మోటార్‌ను పట్టుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి, మంగరాజు, రాంబాబు, పైడిరాజులను పట్టుకుని వారి నుంచి దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

గ్రామీణ అభివృద్ధిలో మహిళా సమాఖ్యలే కీలకం

- వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్ పాణి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్ పాణి

గంట్యాడ:

మహిళా సమాఖ్యలు గ్రామీణ అభివృద్ధిలో ప్రధాన భూమిక పోషిస్తున్నాయని వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్‌పాణి అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. సమాఖ్య మండల అధ్యక్షురాలు కర్రి అనసూయ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహిళలు స్వయం సమృద్ధి సాధించడమే కాకుండా కుటుంబ ఆర్థిక స్థిరత్వానికి మూలస్తంభాలుగా నిలుస్తున్నారని తెలిపారు. స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్, పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ వంటి పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి మహిళా రుణాలను సమయానికి చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సావిత్రి, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ చిరంజీవి, ఏపీఎం సులోచనాదేవి, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతం



గజపతినగరం: గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



గుర్ల: గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న ఎంపీపీ, తదితరులు

గజపతినగరం: మండల కేంద్రంలోని ఎస్‌జీఓ హోమ్‌లో పోషణ మహోత్సవ్ ముగింపు కార్యక్రమం ఐసీడీఎస్ గజపతినగరం ప్రాజెక్ట్ పరిధిలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెంటాడ, గంట్యాడ, దత్తిరాజేరు మండలాలకు చెందిన పది మంది గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అలాగే పుట్టిన బిడ్డకు తప్పకుండా ముర్రుపాలు పట్టాలని.. ఆరు నెలల వరకు తల్లిపాలే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రథమ్ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ రమణ, ఎంపీడీఓ బి.కల్యాణి, ఆర్ఐ.కె.అప్పలరాజుతో పాటు మూడు మండలాల ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి..

గుర్ల: గర్భిణులు క్రమంతప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్‌నాయుడు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద పోషణ్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వెన్నె సన్యాసినాయుడు, కిరణ్‌కుమార్, సీడీపీఓ ఆరుద్ర, తదితరులుపాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యార్థుల జీవితం నాశనం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

- మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రవేట్‌పరం చేయాలని చూస్తోందని.. ఇదే జరిగితే విద్యార్థుల జీవితాలు సర్వనాశనం అవుతాయని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలన్నారున. కోటి సంతకాల్లో భాగంగా గ్రామస్థాయిలో బీసీ, విద్యా, ఎస్సీ, రైతు విభాగం, సోషల్ మీడియా, తదితర ఎనిమిది విభాగాల్లో కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల కాలంలో సుమారు రెండు లక్షల కోట్ల రూపాయలు అప్పు చేసిందన్నారు. జగన్ మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన మెడికల్ కళాశాలలను పూర్తి చేసేందుకు రూ. ఐదు వేల కోట్లు ఖర్చవుతుందని చెప్పిన చంద్రబాబు.. అమరావతి నిర్మాణం కోసం లక్షల కోట్ల రూపాయలను ఎక్కడనుంచి తీసుకువస్తున్నారని ప్రశ్నించారు. చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారే తప్ప ప్రజలకు చేసిన సంక్షేమం ఏమీ లేదని ఆరోపించారు. గ్రామస్థాయిలో ఎనిమిది కమిటీలు ఏర్పాటు చేసి పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, పార్టీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, బెల్లాన త్రినాథరావు, కరణం ఆదినారాయణ, మండల సురేష్, యువజన విభాగం అధ్యక్షుడు కడుపుట్ల పైడపునాయుడు, రెడ్డి పద్మావతి, యజ్జిరోతు వెంకటరమణ, కె.సుబ్రహ్మణ్యం, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వరి పంటకు తెగుళ్ల బెడద..!



వసంతలో పొడ తెగులు సోకిన వరి పంట

గంట్యాడ: అన్నదాతకు కష్టాలు వీడడం లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాలు సకాలంలో కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. ఆలస్యంగా వర్షాలు కురవడంతో రైతులు అష్టకష్టాలు పడి వరి పంట సాగు చేపట్టారు. పంటకు ఎరువు వేద్దామన్నా కూటమి సర్కార్ దయ వల్ల కనీసం యూరియా దొరకని పరిస్థితి నెలకొంది. బస్తా యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడ్డారు. ఎలాగోలా పంటను కాపాడుకుని వస్తే తాజాగా తెగుళ్లు వ్యాపించడంతో అన్నదాత లబోదిబోమంటున్నాడు.

వరి పంటకు ఆశించిన తెగుళ్లు..

వరి పంటకు కొన్ని ప్రాంతాల్లో బ్యాక్టీరియా తెగులు, మరికొన్ని ప్రాంతాల్లో పొడ తెగులు ఆశించగా.. కొన్ని ప్రాంతాల్లో ఆకుముడత తెగులు ఆశించింది. అలాగే మరికొన్ని ప్రాంతాల్లో సుడిదోమ ఆశించింది.

రూ. వేలల్లో ఖర్చు..

వరి పంటకు ఆశించిన తెగుళ్ల నివారణకు రైతులు రూ.వేలల్లో ఖర్చు చేస్తున్నారు. పురుగు మందుల కోసం ఎకరాకు రూ. 800 నుంచి వెయ్యి రూపాయల వరకు ఖర్చవుతోందని అన్నదాతలు చెబుతున్నారు.

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెలుగు డీజీఎం కృష్ణంనాయుడు

మెరకముడిదాం: రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని స్త్రీనిధి డీజీఎం కృష్ణంనాయుడు, ఏజీఎం చిట్టిబాబు సూచించారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో వీఓఏలు, వెలుగు సీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లించాలన్నారు. వెలుగు ఏపీఎం శేఖర్ మాట్లాడుతూ.. ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ ఇతరులు ఆదర్శంగా నిలవాలన్నారు. అలాగే మహిళా సంఘాలకు చెందిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

అంతర పంటలతో అధిక ఆదాయం



ఉద్యానవన పంటలను పరిశీలిస్తున్న ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్

వేపాడ: ఉద్యానవన తోటల్లో అంతర పంటలు సాగు చేయడం వల్ల అధిక ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్ అన్నారు. మండలంలోని కుమ్మపల్లిలో సాగు చేస్తున్న ఉద్యానవన పంటలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మామిడి, జీడిమామిడి తోటల్లో అంతర పంటలుగా రాగి, వరి, తదితర పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. ఒకే రకమైన పంట కాకుండా పంటలను మార్చడం వల్ల భూసారం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ వరప్రసాద్, యూనిట్ ఇన్‌చార్జ్ నారాయణమ్మ, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలుగా ఎదగాలి..



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎంఈఓ - 2 ధర్మశ్రీను



వేపాడ: సైన్స్ సెమినార్‌లో పాల్గొన్న విద్యార్థులు

మెరకముడిదాం: విద్యార్థులు సైన్స్‌పై పట్టు సాధించి శాస్త్రవేత్తలుగా ఎదగాలని మండల విద్యాశాఖాధికారులు చంద్రశేఖర్, ధర్మశ్రీను ఆకాంక్షించారు. గురువారం స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో మండల స్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించారు. ఈ పోటీల్లో గర్భాం ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన ఎం.దుర్గాప్రసాద్ మొదటి బహుమతి.. భైరిపురం జెడ్పీ పాఠశాలకు చెందిన ఎ.జాక్షిత ద్వితీయబహుమతి గెలిపొందారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించారు.

మండల స్థాయి సెమినార్..

వేపాడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు ఎస్. కృష్ణస్వామి ఆధ్వర్యంలో మండల స్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ కె.అప్పారావు, ఎంఈఓ బాలభాస్కరరావు మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు మేలైన సాంకేతికను అందించేందుకు శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఎం.అరవింద్, చరిష్మా విజేతలుగా నిలవడంతో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గజపతినగరం 9010204447 | చీపురుపల్లి 9951602843 | ఎస్.కోట 9951602965
Office mail : vzmadvt@gmail.com